క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో కృష్ణంరాజు సతీమణి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రముఖ సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి మంగళవారం ఇంద్రకీలాద్రి వచ్చారు. ఆమెకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆమె ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు.

దుర్గమ్మను దర్శించుకున్న సినీనటి హేమ



వించిపేట(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాలలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని మంగళవారం సినీ నటి హేమ దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ.. ఏటా అమ్మవారిని క్రమం తప్పకుండా దర్శించుకుంటున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు తనపై పుష్కలంగా ఉన్నాయని.. తనపై ఉన్న నీలాపనిందలు తొలగిపోయి సంతోషంగా ఉన్నానని.. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

జగన్మాత సేవలో వెలంపల్లి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తారాపేటలోని మాడపాటి క్లబ్ ఆవరణలో బెంగాలీ దుర్గామాత అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావుకు బెంగాలీ సంఘ ప్రతినిధులు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, తదితరులు పాల్గొన్నారు.

రేపు కబేళా, చేపల మార్కెట్లకు సెలవు

పటమట(విజయవాడతూర్పు): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని కబేళా, చేపల మార్కెట్లకు సెలవు ప్రకటించినట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లలో జీవాలను వధించడం నిషేధించామని చెప్పారు. అనుమతి లేకుండా జీవాలను వధించినా, వ్యాపారం చేసినా కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. మటన్, చికెన్, చేపలు హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసివేసి వీఎంసీ సిబ్బందికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు

స్వయం ఉపాధిలో శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు అక్టోబర్ మూడో తేది నుంచి వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రస్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జ్యూట్ క్రాఫ్ట్స్ ప్రొడక్ట్ మేకర్ అసిస్టెంట్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, కటింగ్ అండ్ టైలరింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏయిర్ కండీషనర్ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్‌క్రాఫ్ట్స్ మేకింగ్, జామ్, జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, స్మోకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో కాని, 0866–2470420 నంబరును కాని సంప్రదించాలని ఆమె కోరారు.

సింహ వాహిని.. దుర్గా రూపిణీ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



దుర్గాదేవిగా విజయదుర్గా అమ్మవారు



పూజా కార్యక్రమాల్లో గుంటూరు డీఎస్పీ ఎం.రమేష్ దంపతులు



దుర్గాదేవిగా భ్రమరాంబ..

- దుర్గాదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం
- జగన్మాత నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు



కళాకారులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవారు మంగళవారం విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ కుమార్ శర్మలు పూజలు నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన వెంకట మహేష్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వర రావులు దర్శించుకున్నారు. పోతిన వెంకటమహేష్ తన పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు అతిథులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని సాంస్కృతిక కళావేదికపై పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. దేవస్థాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, తమ్మిన సూర్యకుమారి, తొత్తడి భరత్‌లతో పాటు పలువురు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలప్రాజెక్టు సమీపంలో..

పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో..

దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలు, దుర్గాదేవి హోమాన్ని నిర్వహించగా వరికుప్పల విజయ్‌రావు దంపతులు, పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. సేవా సంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పసుమర్తి రామకృష్ణ పూజా కార్యక్రమాలను జరిపించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో కొలువైన లోకనాయకి మంగళవారం దుర్గాదేవి, భూదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కేటీ రోడ్డులోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమి



పోతిన మహేష్‌కు ప్రసాదం అందజేస్తున్న కమిటీ

చ్చారు. బ్రాహ్మణవీధిలోని శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు అభయం ఇచ్చారు. ఉత్సవాలను ఆలయ కమిటీ పర్యవేక్షించింది. గుంటూరు డీఎస్పీ(ట్రాఫిక్) ఎం.రమేష్ దంపతులు చండీహోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు శార్దూల వాహనాన్ని అధిష్ఠించి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శేషయ్యవీధి, బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవానీపురం(విజయవాడ పశ్చిమ): భవానీపురం కోళ్లఫారం రోడ్‌లోని అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్‌లో గల శ్రీ గంగా–దుర్గా–మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయనపాడులో వసంత వేణుగోపాల స్వామి దేవస్థానంలోని అమ్మవారు శ్రీదుర్గాదేవిగా పూజలు అందుకున్నారు.

బాలికలకు సువాసినీ పూజలు..



బాలికలకు సువాసిని పూజలు చేస్తున్న మహిళలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): హెచ్‌బీ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం బాలికలకు సువాసిని పూజలు చేసి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమాలను మందిరం పాలక మండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పీవీ లక్ష్మీ ప్రసాద్, సభ్యులు యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు నిర్వహించారు.

'కూటమి కుట్రలకు తెరపడుతున్నాయి'

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో కూటమి నేతలు చేసిన కుట్రలు ఒక్కొక్కటిగా తెరపడుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మంగళవారం మాట్లాడారు. లిక్కర్ కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డికి కోర్టు బెయిల్ ఇవ్వడం ద్వారా కూటమి నేతల కుట్రలకు అడ్డుపడినట్లుగా పేర్కొన్నారు. లేని లిక్కర్ కుంభకోణాన్ని సృష్టించి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి జైలులో పెట్టిన కూటమి నేతలకు న్యాయస్థానం బెయిల్ ఇవ్వడం చెంపపెట్టులాంటిదన్నారు. సినీ నటుడు చిరంజీవిని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే బాలకృష్ణ దుర్భాషలాడినా జనసేన అధినేత, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు స్పందించకపోవడం అత్యంత దుర్మార్గమని తెలిపారు. చంద్రబాబు అమ్మవారి ఆలయంలోనూ అబద్ధాలు మాట్లాడడం దారుణమన్నారు. ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసిందో బయట పడుతున్నాయన్నారు. తప్పకుండా ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన వివరించారు.

వర్షంనీరు వెంటనే తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో కురిసిన వర్షానికి ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న దసరా నవరాత్రులకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వర్షం పడిన సందర్భంగా రోడ్లపై నీటి నిల్వలను వెంటనే తొలగించాలని సూచించారు. నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీంలు అప్రమత్తంగా ఉంటూ వర్షం నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తోడేయాలని ఆదేశించారు. నగరంలోని రహదారుల్లో వర్షం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో సూపర్ సక్కర్లు, మోటర్లు, గల్పర్లతో తొలగించాలని చెప్పారు. మరుగుదొడ్ల పాయింట్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో అజయ్‌కుమార్ బృందం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం కార్యక్రమంలో చింతా వెంకటరామాంజనేయులు కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. యువ సంగీత కళాకారిణి జి.శాంతి వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. సంగీత కళాశాల నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలను అభినయించారు. కాకినాడకు చెందిన తోట సుబ్రహ్మణ్యం బృందం ప్రదర్శించిన తోలు బొమ్మలాట ఆసక్తికరంగా సాగింది. భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి కార్యక్రమాలను పర్యవేక్షించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాగ మనోజ్ఞ, భవ్యిక సాయి, సంజనా రెడ్డిలు కూచిపూడి నాట్యాలను ప్రదర్శించారు. వెంకటేశ్వర్లు వీరనాట్యం అంశాన్ని ప్రదర్శించారు. డాక్టర్ పీవీఎస్ కృష్ణ ఖడ్గతిక్కన పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

లోకనాయకీ మనసాస్మరామి



నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు



నాట్య ప్రదర్శనలో జోస్యుల శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, సంగీత విద్వాంసులు నృత్యసేవలో అమ్మను తరిస్తూ, ధ్యానిస్తూ పులకించారు. మంగళవారం కార్యక్రమంలో సూరంపల్లికి చెందిన రత్నకుమారి బృందం లయబద్ధంగా తాళం భజన చేశారు. స్వరార్చన కార్యక్రమంలో భాగంగా వి.ఆశ్రిత, గుడిపాటి జయరాం సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన మాధవీ కృష్ణ, రూప నాగ తేజశ్విలు భక్తి గీతాలను ఆలపించారు. ఎం.భార్గవి, సీహెచ్ కృష్ణ ప్రియ, పి.శ్రీవల్లి, ప్రవల్లిక, బెంగుళూరుకు చెందిన సి.దివ్య, నెల్లూరుకు చెందిన జాహ్నవి, గోనుగుంట్ల శైలశ్రీ, ఎం.రజితాదేవి, ఎం.వెంకటేష్, భావన, యల్లాజోస్యుల అనురాధా, జి.విజయగౌరి, కర్నూలుకు చెందిన సాయిలిఖిత, ఎస్.దివ్య సరస్వతీ, రమాదేవిలు కూచిపూడి, భరతనాట్యాలను ప్రదర్శించారు. ఆర్.రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించగా నిర్వాహకులు సైదా గంగాధర్ కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీషిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నృత్య కళాంజలి నాట్యాచార్యులు జోస్యుల శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం భరత నాట్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. 'గంధము పూయెరుగ, గోకుల లీలయా.. కృపాలవాపాలయా, రంగపూజ, బ్రహ్మమొక్కటే, చక్కని తల్లికి ఛాంగుభళా' వంటి కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన భక్తులను రంజింప చేసింది. అలానే అనురాధా శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులను ఆలయ కమిటీ సభ్యులు జ్ఞాపికలతో సత్కరించారు.

రైల్వే టికెట్ రిజర్వేషన్‌లో ఫోన్ నంబర్ తప్పనిసరి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్) కౌంటర్లలో రిజర్వేషన్ టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా చేస్తూ రైల్వే బోర్డు ఆదేశాలు జారి చేసింది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే చర్యల్లో భాగంగా వారితో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడంతో పాటుగా ప్రయాణ సమయంలో అవసరమైన సహాయం, అత్యవసర సేవలకు ఇది ఎంతో ఉపయోగంగా ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. రిజర్వేషన్ చార్ట్ తయారు తరువాత వెయిటింగ్ లిస్ట్ టికెట్ల స్థితి, రైళ్ల రాకపోకలు, ఆలస్యం, మళ్లింపు, రద్దు, రైళ్ల అంతరాయాలు తదితర సమాచారం ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఈ సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకుని టికెట్‌ల రిజర్వేషన్ సమయంలో ఫారంలో ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసి సురక్షితమైన ప్రయాణాన్ని కొనసాగించాల్సిందిగా అధికారులు కోరారు.

హృద్యంగా సాగిన వీణా వాద్యకచేరి

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో మంగళవారం నిర్వహించిన వీణా వాద్యకచేరి హృద్యంగా సాగింది. జీవీఆర్ నృత్య సంగీత కళాశాల విద్యార్థినులు వీణపై సంప్రదాయ కీర్తనలతో పాటు వాగ్గేయకార కీర్తనలను పలికించారు. శరన్నవరాత్రులలో భాగంగా శారదాదేవి రాజరాజేశ్వరిగా, బాలాత్రిపుర సుందరీ శ్రీదుర్గాదేవిగా, శ్రీ మహాలక్ష్మీ ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రుత్వికులు దుర్గా సప్తశతి, చండీ హోమం కార్యక్రమాలను నిర్వహించారు.

కట్టుదిట్టం చేసినా ఆగని వీఐపీ దర్శనాలు

ఆలయ పరిసరాల పరిస్థితిపై ఈవో ఆగ్రహం



సీఎం గేటు ద్వారా దర్శనానికి వచ్చిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో రద్దీ సాధారణంగా ఉన్నప్పటికీ అందరూ వీఐపీ దర్శనాలకే మొగ్గు చూపడంతో ఆలయ ప్రాంగణంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం వీఐపీ టైం స్లాట్‌కు గంట ముందు నుంచే వీఐపీల తాకిడి మొదలైంది. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల అధికారులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కాగా ఆ సమయంలో రూ.300, రూ.100 టికెట్లతో పాటు ప్రత్యేక క్యూలైన్లు ఖాళీగానే ఉన్నాయి. అయితే వీఐపీల పేరిట విచ్చేసిన వారందరూ గాలిగోపురం, సీఎం గేటులో నుంచే దర్శనం కోసం బారులు తీరారు. అదే సమయంలో ఆలయ ఈవో శీనా నాయక్ పరిస్థితిని సీసీ కెమెరాల్లో గమనించారు. గాలిగోపురం వద్దకు చేరుకున్న ఈవో సెక్యూరిటీ, పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ వీఐపీ, సీఎం గేటు ద్వారా దర్శనానికి పంపవద్దని హెచ్చరించారు. దీంతో లక్ష్మీగణపతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్దే భక్తులను పోలీసులు నిలిపివేశారు. సుమారు 3 గంటల పాటు ఎవరినీ అనుమతించకపోవడంతో భక్తులు గుంపులు గుంపులుగా చేరిపోయారు. మరో వైపు సింహం విగ్రహాల గేట్ల వద్ద భక్తులు తోపులాటకు గురై మహిళలు, చంటి పిల్లలు కేకలు వేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

భక్తిశ్రద్ధలతో మురాట్ల ఉత్సవం



దావు బుచ్చయ్య కాలనీలో శ్యామలాంబదేవి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): దావు బుచ్చయ్య కాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి మురాట్ల ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ పుర వీధుల మీదుగా ఊరేగింపు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు మురాట్ల ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు, గౌరీ పర్యవేక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని నగర డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆకాంక్షించారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎన్ రాజు, సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శతాబ్ది ఉత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీవ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవం పోస్టర్‌ను ఆ సంస్థ ప్రతినిధి అసంగానందగిరిస్వామి ఆవిష్కరించారు. మంగళవారం ఆటోనగర్‌లోని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన బెంజిసర్కిల్ సమీపంలోని ఎస్‌వీఎస్ కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని తెలిపారు.









దుర్గామాతా పాహిమాం!

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఇంద్రకీలాద్రిపై వైభవోపేతంగా సాగుతున్నాయి. దుర్గాష్టమి సందర్భంగా జగజ్జననీ.. జగదాంబికా అయిన లోకనాయకి మంగళవారం త్రిశూలం ధరించి అభయమిస్తూ సింహ వాహనంపై దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చల్లగా చూడు తల్లీ.. మళ్లీ వస్తామంటూ భక్తులు అమ్మ ముందు ప్రణమిల్లారు. పలువురు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. సాయంత్రం నగరోత్సవం అట్టహాసంగా జరిగింది. ఉత్సవాలను చూడటానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు కొండపై బారులు తీరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

